క్లుప్తంగా

నేడు తీవ్ర వడగాడ్పులు

కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల ప్రకారం గురువారం జిల్లాలోని ఏడు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 11 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ జె.నివాస్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గండేపల్లి, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గొల్లప్రోలు, కోటనందూరు, పెదపూడి, రౌతులపూడి, సామర్లకోట, కాజులూరు, కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, కరప, తుని మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. బుధవారం జిల్లాలో శంఖవరం మండలంలో 41.6 డిగ్రీల సెంటీగ్రేడ్ అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నివాస్ వివరించారు.

గ్రామీణాభివృద్ధిలో పంచాయతీలే కీలకం

కాకినాడ రూరల్: గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీ రాజ్ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందని రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. 73వ రాజ్యాంగ సవరణ 1993 ఏప్రిల్ 24 నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి రావడంతో అప్పటి నుంచి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ సంస్థలను ఆర్థికంగా పటిష్టం చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వాలు 29 అంశాలను బదిలీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాఘవరావు, రాజా, శ్రీనగేష్, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధ్వసభ కమిటీ ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం భగవంతుని సేవ అని రాజమండ్రి ఉత్తరాది మఠాధికారి సుధా పండితులు విజయ సింహాచార్ అన్నారు. హుండీ అనంతలక్ష్మికి వైద్య సేవ నిమిత్తం రూ.10 వేల నగదు ఆమె భర్త తిమ్మాజీకి విజయ సింహాచార్ బుధవారం స్థానిక మధ్వసభలో అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో కాకినాడ మధ్వ సభ కమిటీ విశేష సేవలు చేస్తోందని కొనియాడారు. ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడుతున్నా హుండీ తిమ్మాజీకి ఆర్థిక చేయూతనివ్వడం ఆ కుటుంబానికి ఎంతో మేలు చేసిన వారు అవుతారని ఆచార్యులు అన్నారు. కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్ర స్వామి, కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు, ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, సంయుక్త కార్యదర్శి యాతగిరి పరశురామ్ కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

ఎన్డీఏ సమన్వయకర్తగా యార్లగడ్డ రామ్‌కుమార్



బోట్‌క్లబ్: కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్డీఏ సమన్వయకర్తగా యార్లగడ్డ రామ్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నుంచి తనకు నియమాక పత్రం అందినట్లు బుధవారం ఆయన విలేకర్లకు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయనను పార్టీ నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు, పైడా కృష్ణమోహన్ అభినందించారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ



కొత్తపేట మార్కెట్‌లో పారిశుధ్యంపై ఆరా తీస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం నగరంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పదో సర్కిల్ పరిధిలోని కొత్తపేట మార్కెట్, లచ్చిరాజు వారి విధి ప్రాంతాల్లో పర్యటించి రహదారులు, డ్రైనేజీల పరిశుభ్రతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజల నుంచి తడి-పొడి చెత్తను వేర్వేరుగా మాత్రమే సేకరించాలని సూచించారు. ప్రజలు, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఇతర సిబ్బంది ఉన్నారు.

మీ చల్లని దీవెనలు అందించండి

- ఓటర్లను అభ్యర్థించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు
- మండే ఎండను లెక్క చేయకుండా.. పి.వెంకటాపురంలో ప్రచారం

కాకినాడ రూరల్: మీ చల్లని దీవెనలు మాపై ఉంచాలని, రానున్న ఎన్నికలల్లో తనను, తనతో పాటు ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ఓటర్లను అభ్యర్థించారు. నామినేషన్ల ఘట్టం ముగింపు దశకు చేరుకోవడంతో గ్రామాల్లో ఎన్నికల ప్రచారం వేడెక్కింది. మండే సూరీడుని లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నుంచి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న, సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం ఉదయం పి.వెంకటాపురంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ఫ్యాన్ గుర్తుకు ఓటును అభ్యర్థించారు. గ్రామంలోని రామాలయం నుంచి మొదలుకొని పలు వీధుల్లో ప్రచారం అనంతరం పాత కాలనీ, కొత్త కాలనీ, అరవింద్ నగర్, పండూరు జంక్షన్ ఏరియాలో ప్రచారం చేశారు. గ్రామ ఉప సర్పంచ్ పెంకే సోమరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు కన్నబాబుకు బ్రహ్మరథం పట్టారు. ఇంటింట హారతులు ఇచ్చి ఆశీర్వచనాలు అందించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌బాబును సీఎంను చేస్తామని, ఎంపీగా సునీల్, ఎమ్మెల్యేగా కన్నబాబును గెలిపిస్తామని ఈ సందర్భంగా మహిళలు పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా కన్నబాబు మాట్లాడుతూ మీ చల్లని దీవెనలు తనపై, ఎంపీ అభ్యర్థిపై ఉంచాలన్నారు. సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్ మరో అధికారంలోకి వస్తేనే రానున్న ఐదేళ్ల పాటు పథకాలు అందుబాటులో ఉంటాయన్నారు. కూటమి కట్టి వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్య ప్రకాశరావు, పండూరు ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాసరావు, నాయకులు నందిపాటి ధర్మరాజు, వార్డు సభ్యుడు పెంకే సంధ్య, పిల్లి భాస్కరరాజు, శ్రీనివాసరావు, వల్లు సుబ్రహ్మణ్యం, కేశబోయిన హరిబాబు, బాబ్జీ, గణేష్, సతీష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



పి.వెంకటాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

కరప: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. మండలం నడకుదురులో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు.



నడకుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ముందుగా అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలుచేసి, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులు వెంటరాగా ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామంలో ఎక్కడకు వెళ్లినా మహిళలు, గ్రామస్తులు ఇంటి నుంచి బయటకు వచ్చి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించడానికి మేమంతా సిద్ధం అంటూ స్వాగతం పలికి, మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశామన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూర్చామని, అందుకు మీకు మేలు జరిగిందనుకుంటేనే ఓటేయండని అడిగే దమ్మున్న నాయకుడు సీఎం జగన్ ఒక్కరే అన్నారు. గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలు నిర్మించడం జరిగిందని, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, నాడు-నేడులో పాఠశాలలు ఆధునీకరణ, అంబేడ్కర్ విగ్రహానికి షెల్టర్ నిర్మించినట్టు తెలిపారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్, కోదండ రామాలయం, రామలింగేశ్వరస్వామి ఆలయాల పునర్నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేశామన్నారు. నడకుదురులో అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపేణా రూ.64 కోట్లు మేర లబ్ధిచేకూర్చామన్నారు. సీఎం జగన్ పాలనలో అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని చూసి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కన్నబాబు ఓటర్లను అభ్యర్థించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, గ్రామ సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీటీసీలు పైలా రామతులసి, ముమ్మిడి బుచ్చిబాబు, మాజీ ఎంపీటీసీలు జవ్వాది సతీష్, పబ్బినీడి చక్రరావు, దాలిపర్తి శ్రీనివాస్, పైలా గోవిందు, పోతల లోవప్రసాద్, జువ్వల చిన్నారావు, ఏసు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అజెండా లేని పార్టీలను తిప్పికొట్టండి

- అధికారమే లక్ష్యంగా 'కూటమి' కలయిక
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కేవలం అధికారమే లక్ష్యంగా ఏర్పడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ అనైతిక కూటమిని రానున్న ఎన్నికల్లో తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన కుమార్తె డాక్టర్ ప్రణీతతో కలిసి 28వ డివిజన్ రంగయ్యనాయుడు ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసం ఏం చేస్తామో చెప్పలేని దుస్థితిలో ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయని, ఆ పార్టీలకు కావాల్సిన దల్లా అధికారం ఒక్కటేనన్నారు. ఇలాంటి కూటమి పార్టీలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గడచిన ఐదేళ్లలో కాకినాడ నగరాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దగలిగానన్న సంతృప్తి ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాన్ని గుర్తించి కుల, మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించారన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాకముందు, వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు.

ద్వారంపూడి మహాలక్ష్మి ప్రచారం

సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి భార్య మహాలక్ష్మి బుధవారం 9వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కంపర బాబి ఆధ్వర్యంలో ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్లను కలిసి భర్త ద్వారంపూడి చేసిన అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు. అలాగే ద్వారంపూడి కుమార్తె డాక్టర్ అంజని 18వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. తన తండ్రి ద్వారంపూడికి మరోసారి విజయాన్ని అందించాలని కోరారు. గడచిన ఐదేళ్లలో కాకినాడ నగర ఊపురేఖలు సమూలంగా మారిపోయాయన్నారు. 2019లో ఎన్నికల ప్రచారంలో తిరిగినప్పుడు అధ్వానంగా ఉండే రహదారులు, డ్రైనేజీలు ఇప్పుడు సుందరంగా తయారయ్యాయన్నారు. ఆమె వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, స్థానిక నాయకులు చవ్వాకుల రాంబాబు, దోణి చిట్టిబాబు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఆయన కుమార్తె డాక్టర్ ప్రణీత తదితరులు

ద్వారంపూడి అల్లుడి ప్రచారం

అలాగే స్థానిక 41వ డివిజన్ ఓలేటివారి వీధి, చాగంటి వారి వీధి, పూళ్లవారి వీధి ప్రాంతాల్లో ఎమ్మెల్యే ద్వారంపూడికి మద్దతుగా ఆయన అల్లుడు డాక్టర్ ఉదయ్‌శేఖర్ రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజల యోగక్షేమాలను విచారిస్తూ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని మరో సారి గెలిపించాలని అభ్యర్థించారు. 41 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో నాయకులు ఇనుకొండ పట్టాభిరామయ్య, గోడి వెంకట్, రాగం విక్రమ్, కృష్ణారెడ్డి, సోమిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



41వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ద్వారంపూడి మహాలక్ష్మి



ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి కుమార్తె డాక్టర్ అంజని తదితరులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతులు, అభివృద్ధి పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అన్నమఘాటీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని నరసింహారోడ్డు, శివాలయంవీధి, తారకరామానగర్, ఘాటీసెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందరనగర్, పప్పులమిల్లు ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావు నగర్, సత్యదేవినగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకా నారాయణమ్మతోట, కాపులవీధి, మున్సిఫ్ జంక్షన్, కొవ్వూరు, డిమార్ట్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు చొల్లంగి ఫీడర్ పరిధిలోని ముత్తానగర్, గోళీలపేట, తుఫాన్ బిల్డింగ్, పోర్టుకాలనీ, గోపాలకృష్ణ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

పవర్ హౌస్ సబ్‌స్టేషన్ పరిధిలో

కాకినాడ పవర్ హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని శేషగిరిరావువీధి, మేదూరివారివీధి ప్రాంతాల్లో ఈ అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



మత్స్యకారులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



జనసేన యూత్ సభ్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ : స్థానిక దుమ్ములపేట జ్యోతుల వారి వీధి ప్రాంతానికి చెందిన సుమారు 50 మంది మత్స్యకారులు జనసేన, టీడీపీల నుంచి బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో వీరంతా ఎమ్మెల్యే ద్వారంపూడి నివాసంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో చోడిపిల్లి ప్రసన్న, తిరిది నూకరాజు, కారే శివ, గంటా శివ, తిరిది రాము, సూరాడ సతీష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకున్నారని, ప్రధానంగా ఓఎన్‌జీసీ నష్టపరిహారాన్ని ఇప్పించేందుకు ఆయన ఎంతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. సమస్యల పట్ల చిత్తశుద్ధి కలిగిన సీఎంను మరోసారి గెలిపించేందుకు మత్స్యకారులు సన్నద్ధం కావాలని ఆయన కోరారు.

జనసేన యూత్ చేరిక..

స్థానిక జగన్నాథపురం 22వ డివిజన్ గొల్లపేట ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది జనసేన యూత్ సభ్యులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి నేతృత్వంలో స్థానిక నాయకులు సతీష్‌యాదవ్ పిలుపు మేరకు పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చిన వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారం చేపట్టడమే లక్ష్యంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు కష్టించి పనిచేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపునిచ్చారు.

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- కరపలో కొత్త శాఖ ప్రారంభం

కరప: అన్ని వర్గాల వినియోగదారుల శ్రేయస్సే ధ్యేయంగా తక్కువ వడ్డీకే రుణ పరపతి కల్పిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ తపోధన్ దెహేరీ కోరారు. కరపలో బుధవారం ఎస్‌బీఐ కొత్తబ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1437 బ్రాంచ్‌లు ఉండగా, వినియోగదారుల సౌలభ్యం కోసం తమ బ్యాంక్ ఇక్కడ 1438 బ్రాంచ్ ప్రారంభించడం జరిగిందన్నారు. బ్రాంచ్ మేనేజర్ వికాష్‌పాల్ మాట్లాడుతూ వ్యవసాయదారులకు బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. ఎడ్యుకేషన్, బిజినెస్, హోమ్, కార్ లోన్లు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రాంతీయ కార్యాలయం చీఫ్ మేనేజర్ (ఆపరేషన్స్) సాయి రామమోహన్, సీఎం క్రెడిట్ సాయి సర్వోత్తమ్, మాధవరంజన్, డిప్యూటీ మేనేజర్ అడ్మిన్ ఎంవీఎల్ కామేశ్వరి పాల్గొన్నారు.



కరపలో ఎస్‌బీఐ కొత్త శాఖను ప్రారంభిస్తున్న చీఫ్ మేనేజర్ తపోధన్ దహేరీ

పసుపు, కుంకుమ ప్యాకెట్లతో నూకాలమ్మతల్లి అలంకరణ

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో గ్రామదేవత నూకాలమ్మ తల్లిని బుధవారం పసుపు కుంకుమలతో అలంకరించారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. పంచారామ క్షేత్రంలోని దీపారాధన సంఘ సభ్యులు ఈ అలంకరణ చేశారు. భక్తులు సమర్పించిన పసుపు, కుంకుమను ప్యాకెట్లుగా తయారు చేసి అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలచే సామూహిక పూజలు, పారాయణలు చేశారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొమ్మలరావు, యార్లగడ్డ శ్రీనివాసు, పెనుమర్తి సత్యనారాయణ, పారాయణ కమిటీ నాయకురాలు సత్తి అరుణ భక్తులకు సేవలందించారు. సాయంత్రం ఆలయ అర్చకులు ప్రవీణకుమార్ ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



పసుపు, కుంకుమ ప్యాకెట్ల అలంకరణలో నూకాలమ్మ తల్లి

ఈతకు వెళ్లి యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వూరు గ్రామంలో లాకుల వద్ద ఈతకు వెళ్లిన కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఆరుగురు యువకుల్లో పెయింటింగ్ పనిచేసుకునే అనపర్తి శ్రీను (20) గురువారం మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు వివరాల ప్రకారం శ్రీను, మరో ఐదుగురు కలిసి కొవ్వూరు కెనాల్‌లోని ఈతకు వెళ్లారు. వీరిలో శ్రీను గల్లంతయ్యాడు. కొద్ది దూరంలో శ్రీనును గుర్తించి ఒడ్డుకు చేర్చి జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందాడు. మృతుడి నానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై మణికుమార్ తెలిపారు.

ఇంద్రపాలెంలో తాగుబోతు వీరంగం

కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని మునలమ్మ గుడి ప్రాంతంలో మద్యం తాగిన మత్తులో ఒక వ్యక్తి వీరంగం సృష్టించాడు. చిరు వ్యాపారులపై దాడికి తెగబడ్డాడు. ఆతడి దాడిలో కొబ్బరి బొండాలు అమ్ముకునే చిరు వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై ఇంద్రపాలెం ఎస్సై మణికుమార్ స్పందిస్తూ తాగుబోతుపై చర్యలు తీసుకుంటామని, గాయపడిన వారు ఆస్పత్రికి వెళ్లారని వారి నుంచి ఫిర్యాదు రావాల్సి ఉందన్నారు.



తాగుబోతు దాడిలో గాయపడిన వృద్ధుడు

ఐదు నామినేషన్లు-ఆరుసెట్లు



నామినేషన్ వేస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఐదు నామినేషన్లు, ఆరు సెట్లు దాఖలయ్యాయి. ఆయా నామినేషన్లను సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుకు అందజేశారు. నామినేషన్ వేసిన వారిలో ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి (వైఎస్సార్ సీపీ), ద్వారంపూడి వీరభద్రారెడ్డి (వైఎస్సార్ సీపీ), గింజాల చక్రవర్తి (జై భీమ్‌రావ్ భారత్‌పార్టీ)- రెండు సెట్లు, నారాయణరావు బొడ్డు (టీడీపీ), వెంకటేశ్వరరావు వనమాడి (టీడీపీ) నామినేషన్లు దాఖలు చేశారు.

ఆరుగురు నామినేషన్ దాఖలు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వంలో భాగంగా నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు బుధవారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లను ఆర్వో ఇట్ల కిశోర్‌కు సమర్పించారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థిగా కర్రి గోపాలకృష్ణ, జనసేన తరపున పంతం సందీప్ రెండు సెట్లు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున పలివెల స్వరూప్ ఒక సెట్, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున పిల్లి సత్యలక్ష్మి, పిల్లి సుజన, బహుజన సమాజ్ పార్టీ తరపున సాధనాల రాజు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారంతో నామినేషన్ల స్వీకరణ ముగియనుంది.

నేడు చలమలశెట్టి నామినేషన్



కాకినాడ: వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 11.45 నిమిషాలకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నివాస్‌కు తన నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు. ఉదయం 9 గంటలకు శాంతినగర్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి ఆనందభారతి మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా బాలాజీచెరువు, జీజీహెచ్, జెడ్పీ సెంటర్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంటారు. నామినేషన్ దాఖలుకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నారు. ప్రధానంగా ఆయా అసెంబ్లీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని సునీల్ పిలుపునిచ్చారు.

ఎన్నికల పరిశీలకులను కలసిన కలెక్టర్, ఎస్పీ



ఎన్నికల పరిశీలకుడు ఎస్.గణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: ఎన్నికల పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, జేసీ రామ్ సుందరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్ కాకినాడ పార్లమెంట్ పరిధిలోని తుని, పిఠాపురం, కాకినాడ పట్టణం అసెంబ్లీ నియోజవర్గాలు, రాజేష్ జోగ్‌పాల్ ప్రత్తిపాడు, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యవేక్షిస్తారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం



పుష్పాలంకరణలో స్వామి, అమ్మవార్లు

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి శ్రీపుష్పోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వివిధ రకాలు పుష్పాలతో అలంకరించారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లతో చూడముచ్చటగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.